## క్లుప్తంగా

### ఓటరు జాబితాలో డోర్ నంబర్ తప్పనిసరి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ గణపతిరావు

వేపాడ: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితాలో ఓటర్ల డోర్ నంబర్‌ను తప్పనిసరిగా నమోదు చేయా లని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ) గణపతిరావు బీఎల్‌ఓలకు సూచించారు. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు ఓట ర్ల జాబితాపై ఇంటింట సర్వే నిర్వహించనున్న నేపథ్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు గురువా రం శిక్షణ ఇచ్చారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ సర్వేలో భాగంగా 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరితో ఓటు హక్కుకు దరఖాస్తు చేయించాలని చెప్పారు. అలాగే జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టాలన్నారు. ఎక్కడైనా అదనంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంటే గుర్తించాలని చెప్పారు. ఎస్.కోట నియోజకవర్గ ఎన్నికల అధికారి సుదర్శనదొర, తహసీల్దార్ ప్రసన్నకుమార్, నారాయణమ్మ, ఎంపీడీఓ పట్నాయక్, ఉప తహసీల్దార్ సన్యాసినాయుడు, ఆర్ఐ రామలక్ష్మి పాల్గొన్నారు.

### చోడిపంట సాగును ప్రోత్సహించండి



కౌలు రైతుకు గుర్తింపు(సీసీఆర్‌సీ) కార్డు అందజేస్తున్న జేసీ మయూర్ అశోక్

బొండపల్లి: మెట్ట భూముల్లో చోడి (రాగులు) పంటను సాగుచేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని జేసీ కె.మయూర్ అశోక్ సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే)లో గురువారం ఆయన తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పలువురు కౌలు రైతులకు సీసీఆర్‌సీ (క్రాప్ కల్టివేటెడ్ రైట్స్ కార్డు)లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఆర్బీకేలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువులను అందుబాటులో ఉంచాలని, ఎరువుల స్టాకు వివరాలను పరిశీలించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించా రు. అలాగే పీఎం కిసాన్‌కు సంబంధించి ఇంకా ఈకేవైసీ చేయించుకోని రైతులతో త్వరగా ఈకేవైసీ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంకా గ్రామాల్లో అర్హత ఉన్న కౌలు రైతులను గుర్తించి వారందరికీ కౌలు గుర్తింపు(సీసీఆర్‌సీ) కార్డులు అందజే యాలని అధికారులకు సూచించారు. గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ కె.హమరాజన్, ఏఓ పి.వి. మల్లికార్జునరావు, బొండపల్లి ఉప సర్పంచ్ కోళ్ల వెంకటరమణ, ఎంపీటీసీ బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### భూపంపిణీకి రంగం సిద్ధం

- 1,025 మందికి 910.95 ఎకరాలు

చీపురుపల్లి: భూమిలేని పేదలు ఎన్నాళ్ల నుంచో వేచి చూస్తున్న సమయం రానే వచ్చింది...అప్పట్లో మహానేత దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదలకు భూపంపిణీ జరిగింది. మళ్లీ పద్నాలుగేళ్ల తరువాత ఆయన తనయుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో మరోసారి భూ పంపిణీకు అధికారులు రంగం సిద్ధం చేశారు. దీంతో లబ్ధిదారుల్లో ఆనందం నెలకొంది. 2009కి ముందు వైఎస్సార్ పేదలకు భూపంపిణీ చేశారు. అంతవరకు పేదలు సాగుచేసుకుంటున్న ప్రభుత్వ భూములను సర్వే చేయించి, వారికి ఆభూమిపై పూర్తి హక్కులు కల్పించారు. ఆయన మరణానంతరం పాలించిన కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాల హయాంలో పేదలకు భూపంపిణీ చేయలేదు. ఇన్నాళ్లకు సీఎం జగన్ పేదలను భూయజమానులుగా చేయాలనే ఆలోచనతో భూపంపిణీకి శ్రీకారం చుట్టారు. బుధవారం జరిగిన కేబినేట్ సమావేశంలో భూపంపిణీకి ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల్లో భూపంపిణీకి రెవెన్యూ అధికారులు రంగం సిద్ధం చేశారు. నియోజవకర్గంలో 1,025 మందికి 910.95 ఎకరాల భూమిని పంపిణీ చేయనున్నారు.

### ప్రతీ గురువారం ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలి



అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

జామి: పాఠశాల విద్యార్థులకు ప్రతీ గురువారం ఐరన్ మాత్రలు అందించి, వాటిని వారు మింగేలా చూడాలని వైద్యసిబ్బందికి డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు సూచించారు. కుమరాం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను గురువారం ఆయన సందర్శించారు. పాఠశాల,అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పరిసరాలను, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణుల వివరాల నమోదుపై ఆరా తీశారు. కేంద్రంలో ఐరన్ మాత్రల నిల్వలను పరిశీలించారు. అలమండ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ముత్యాలమ్మ, నారాయణరావు, లక్ష్మి ఆయన వెంట ఉన్నారు.

# ప్రభుత్వ సేవలు, సంక్షేమంలో కొత్తచరిత్ర

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి



గ్రామ సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కడుబండి



అలుగుబిల్లిలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వసేవలన్నీ గ్రామాల్లోనే అందిస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి కొత్త చరిత్ర సృష్టించారనిఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు అన్నారు. మండలంలోని అలుగుబిల్లి గ్రామంలో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వ హించారు. గ్రామంలో ప్రతీ ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి ప్రభుత్వం వల్ల ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను వివరించి, వారి యోగక్షేమాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ ఒక ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో ప్రతీ గడపకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం దేశంలో ఎక్కడా లేదన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఎవరికి ఏం కావాలో తెలుసుకుని వారంతా ఆర్థిక ప్రగతి సాధించేలా, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. దళారీ వ్యవస్థ లేకుండా పక్కాగా పథకాలు అమలు చేస్తున్న నాయకుడు జగన్ అన్నారు. ఈసంక్షేమం సాగాలంటే మరో దఫా జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి కావాలని, ప్రజలంతా ఆయన్ని ఆశీర్వదించాలని కోరారు. స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, ఏఎంసీ డైరెక్టర్ డి.పార్వతి, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, జేసీఎస్ ఇన్‌చార్జ్ వి.సతీష్, ఎస్.చంద్రరావు, మోది కాశీవిశ్వనాథ్, బీల వెంకటరావు, చామలాపల్లి, వెంకటరమణపేట సర్పంచ్‌లు జుత్తాడ సూర్యారావు, మంచిన శివకోటి రాయవరపు సత్యం, ఎంపీటీసీ కె.అప్పయ్య, నాయకులు జగన్నాథం, కిలపర్తి సత్యం, మమ్ములూరి సోంబాబు, బంగారు నాయుడు, చింతల నారాయణమూర్తి, మోపాడ కోటి పాల్గొన్నారు.

**మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు**

ప్రభుత్వ సేవల కోసం గతంలో పనులు మానుకుని, మండల, జిల్లా కేంద్రాల చుట్టా తిరగాల్సిన అవసరం లేకుండా, అన్ని సేవలూ గ్రామాల్లోనే అందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తగిన వ్యవస్థలను గ్రామాల్లోకి తీసుకొచ్చారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు అన్నారు. అందులో భాగంగానే గ్రామా ల్లో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అలుగుబిల్లి గ్రామంలో గ్రామసచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ సెంటర్ల నూతన భవనాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు తమ అవసరాలకు ఊరు దాటి బయటకు రావాల్సిన అవసరం లేకుండా చూడాలని, వారికి ప్రభుత్వం అందుబాటులో ఉండాలని ఒక సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. రైతాంగానికి కావాల్సిన అన్ని సేవలు రైతుభరోసా కేంద్రాల్లో అందుతున్నాయన్నారు. ఎంపీడీఓ శేషుబాబు, పీఆర్ జేఈ సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## నాడు– నేడు పనులను త్వరగా పూర్తి చేయాలి

- అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం



గరుగుబిల్లిఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

మెరకముడిదాం: పాఠశాలల్లో నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. మండ లంలో గురువారం ఆమె పర్యటించారు. ముందు గా గరుగుబిల్లి ఉన్నత పాఠశాలను సందర్శించి, నాడు–నేడులో భాగంగా పాఠశాలల్లో చేపడుతున్న మరుగుదొడ్లు, అదనపు తరగతి భవనాల నిర్మాణాలను పరిశీలించారు. పనులకు ఎంత నిధులు మంజూరయ్యాయని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. రాగిజావతో పాటు, పులిహోరా ను రుచి చూశారు. 10వతరగతి విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం సాతాంవలస ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనులను పరిశీలించారు. అక్కడి నుంచి మెరకము డిదాం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి రెవెన్యూ అధికారులతో సమగ్రభూరీసర్వేపై సమీక్ష నిర్వహించారు. మండలంలో భూరీసర్వేను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బుధరాయవలసలో నిర్వహిస్తున్న 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, మందుల వివరాలను వైద్యాధికారి అనిల్ కుమార్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

### నేడు ఆర్బీకే భవనం ప్రారంభం

జామి: ఆర్.బి.పురం రైతుభరోసా కేంద్రం (ఆర్బీకే) నూతన భవనాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభిస్తారని ఎంపీడీఓ సతీష్ గురువారం తెలిపారు. అనంతరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

## పల్లెల్లో 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు



బొండపల్లి: కనిమెరకలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ పద్మావతి



గజపతినగరం రూరల్: లోగిశలో ప్రజలకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ అనూజ్‌రాయ్

బొండపల్లి/ గజపతినగరం రూరల్: మండలంలోని కనిమెరక గ్రామంలో దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.పద్మావతి, గజపతినగరం మండలంలోని లోగిశ గ్రామం లో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అనూజ్‌రాయ్ ఆధ్వర్యంలో గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శిబిరాలు ఏర్పాటు చేసి ఓపీ (అవుట్‌పేషెంట్) సేవలు అందించారు. కనిమెరకలో 60 మందికి, లోగిశలో 89 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గృహసందర్శన చేసి ప్రజలకు వైద్య తనిఖీలు చేశారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

## 'జగనన్న సురక్ష'తో సేవలు చేరువ

'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యాయని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. ఎస్.కోట, గజపతినగరం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో 'జగనన్న సురక్ష' క్యాంపులు గురువారం నిర్వహించారు. ఎస్.కోట మండలం అలుగుబిల్లిలో నిర్వహించిన క్యాంపులోఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, మెరకముడిదాం మండలంలోని గరుగుబిల్లిలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, కొత్తవలస మండలంలోని రామలింగాపురం, ముసిరాం గ్రామాల్లో నిర్వహించిన క్యాంపులకు రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు హాజరయ్యారు. ప్రజలకు 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. - సాక్షి నెట్‌వర్క్



శృంగవరపుకోట: అలుగుబిల్లి గ్రామంలో ప్రజలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



మెరకముడిదాం: గరుగుబిల్లిలో మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



గుర్ల: పాలవలసలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ పొట్నూరు ప్రమీల



దత్తిరాజేరు: ఇంగిలాపల్లిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, అధికారులు



గంట్యాడ: పెదవేమలిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ భానోజీరావు, డీటీ స్వర్ణకుమార్



కొత్తవలస: రామలింగపురంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు



లక్కవరపుకోట: మార్లాపల్లిలో మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎంపీడీఓ జ్ఞానేశ్వరరావు



గజపతినగరం: పురిటిపెంటలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, తదితరులు

## సేవలు అమోఘం



**ఆస్పత్రికి వచ్చి పింఛన్ అందజేశారు**

అనారోగ్యంలో బాధపడుతూ విశాఖపట్నంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో మా వలంటీర్ కోరాడ పావని ఆస్పత్రికి వచ్చి పింఛన్ డబ్బులు అందజేసింది. ఆ డబ్బులు మందుల ఖర్చుకు ఉపయోగపడ్డాయి. అర్హత ఉన్న పథకాలకు మా తరఫున వలంటీర్లే దరఖాస్తు చేస్తున్నారు.

– మండల బంగారమ్మ, గరికివలస, గుర్ల మండలం



**కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు**

గ్రామ వలంటీర్ వ్యవస్థ వచ్చాక ప్రభుత్వ సేవలు, పథకాల కోసం కార్యాలయాలు, ప్రజాప్రతినిధులు, నాయకుల చుట్టూ తిరగాల్సిన పనితప్పింది. పథకాలను ఇంటివద్దకే అందిస్తున్నారు. ప్రభుత్వ పంపిణీ చేస్తున్న ఇళ్ల పట్టాలకు మా వలంటీర్ మా ధ్రువపత్రాలను సచివాలయానికి తీసుకువెళ్లి మా తరఫున దరఖాస్తు చేశారు. ప్రభుత్వం ఇంటి స్థలం మంజూరు చేసింది. ప్రభుత్వ ఆర్థిక సహకారంతో ఇంటి నిర్మాణం పూర్తి చేశాం. అర్హత ఉన్న అన్ని పథకాలకూ వారే దరఖాస్తుచేసి మంజూరు చేయిస్తున్నారు.

– గంద్రేటి ఆదినారాయణ,గుర్ల గ్రామం

## ఘనంగా ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు



శృంగవరపుకోట: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



కొత్తవలస: చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

శృంగవరపుకోట: ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలను పట్టణంలోని శిరికి రిసార్ట్స్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు గురువారం ఘనంగా నిర్వహించాయి. స్థానిక దేవీ ఆలయంలో, గ్రామదేవత దారగంగమ్మ ఆలయాల్లో ఉదయం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి, అర్చకుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం శిరికి రిసార్ట్స్‌లో పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, డీసీసీబీ చైర్మన్ వి.చినరామునాయుడు, రాష్ట్రవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, నియోజకవర్గంలోని అయిదు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యారోగ్యశాఖ ఉద్యోగులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. కొందరు ఎమ్మెల్యేను సత్కరించారు.

**చీరల పంపిణీ**

కొత్తవలస: ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా కాకర సత్యవాణి,గౌరీశంకర్ దంపతుల ఆర్థిక సహాయంతో మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద 50 మంది వృద్ధ మహిళలకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం చీరలు పంపిణీ చేశారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి ఆయనతో కేకు కట్ చేయించారు. రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, నాయకులు బొని వెంకటఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీకి ఎంపిక

మెరకముడిదాం: గర్భాం మోడల్‌స్కూల్ నుంచి పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆరుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీ(ఐఐఐటీ)కి ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ గురువారం తెలిపారు. ఎంపికైన విద్యార్థినులు వై.సాయిస్ఫూర్తి, ఎం.లలితారాణి, టి.బ్రాహ్మిణి, ఆర్.త్రిష, ఎస్.హరిత, ఎస్.మల్లేశ్వరిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

**కుమరాం హైస్కూల్ నుంచి ఏడుగురు..**

జామి: మండలంలోని కుమరాం ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుకున్న వారిలో ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని హెచ్‌ఎం సీహెచ్.పద్మావతి తెలిపారు. విద్యార్థులు పి.కుసుమ, ఎస్.సాధన, ఎస్.గౌతమ్ నూజివీడు, వై.నిరుపమ, యల్ల భార్గవి, బి.మృదుల, పి.భార్గవి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు.

**వేపాడ మోడల్ స్కూల్ నుంచి ఏడుగురు..**

వేపాడ: వేపాడ మోడల్ స్కూల్ నుంచి ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు తెలిపారు. నూజివీడు క్యాంపస్‌కు ముచ్చకర్ల స్వాతి, బోజంకి రవీంద్ర, శ్రీకాకుళం క్యాంపస్‌కు అరిగి శ్రీనివాస్, ఇర్రా మేఘన, గల్లా గీష్మ, గాయిత్రీ, కసగాడ వాసవీ, ఆర్.కె.వ్యాలీ క్యాంపస్‌కు బోజంకి భాను ప్రసాద్ ఎంపికయ్యారు.

**బొండపల్లి హైస్కూల్ నుంచి అయిదుగురు..**

బొండపల్లి: స్థానిక ఉన్నత పాఠశాల నుంచి అయిదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారని హెచ్‌ఎం బి.ఉమామహేశ్వరరావు తెలిపారు. శిరువూరి సాయిచంద్రనిఖిత, గెద్ద ప్రవళ్లిక, వై.నిర్జర నూజివీడు క్యాంపస్‌కు, ముద్దాడ రేణుక, గొండేల రూప శ్రీకాకుళం క్యాపస్‌కు ఎంపికయ్యారు.

**దత్తిరాజేరు మండలంలో ఆరుగురు..**

దత్తిరాజేరు: మరడాం ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని హెచ్‌ఎం బంగార్రాజు తెలిపారు. రాహుల్ శ్రీనివాస నాయుడు శ్రీకాకుళం క్యాంపస్‌కు, వాలేటి గాయత్రి నూజివీడు క్యాంపస్‌కు, పెంకి వరలక్ష్మి శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికయ్యారు. కె.కొత్తవలస జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి జీవన్, జి.మధు ఒంగోలు క్యాంపస్, వి.సాయిగణేష్ శ్రీకాకుళం క్యాంపస్‌లో సీట్లు సాధించారని ప్రిన్సిపాల్ సీతారాం తెలిపారు.

**కొత్తవలస మండలం నుంచి ఆరుగురు..**

కొత్తవలస: స్థానిక ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారని ఎంఈఓ బండారు శ్రీనివాసరావు గురువారం తెలిపారు. మోడల్ స్కూల్‌కు చెందిన ఉగ్గిన మనోజ్ఞసాయిశ్రీ నూజివీడు క్యాంపస్‌కు, జి.లక్ష్మిప్రసాద్ ఒంగోలు క్యాంపస్, ఎల్.నాగసిద్ధువరభానుమనోజ్, జి.కార్తిక్ శ్రీకాకుంళం క్యాంపస్‌లకు ఎంపికయ్యారు. కొత్తవలస ఉన్నత పాఠశాల నుంచి ఎ.పల్లవి, ఎల్.కర్మిష్మా నూజివీడు క్యాంపస్‌ల్లో సీట్లు సాధించారు.

**గరివిడి కేజీబీవీ నుంచి ఇద్దరు..**

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి కేజీబీవీకి చెందిన విద్యార్థినులు కె.సునీత, ఎస్.ప్రసన్న శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సీట్లు సాధించారని కేజీబీవీ ప్రత్యేకాధికారి ధనలక్ష్మి తెలిపారు.

**ఎస్.కోట మండలం నుంచి ముగ్గురు..**

శృంగవరపుకోట: ధర్మవరం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు మిడతాన లిఖిత, కరగాన జాహ్నవి, స్థానిక శ్రీరవితేజ పాఠశాల విద్యార్థిని కర్రి రేష్మ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సీట్లు సాధించారు. వారికి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



వై.సాయిస్ఫూర్తి, గర్భాంమోడల్‌స్కూల్ | టి.బ్రాహ్మిణి, గర్భాం మోడల్‌స్కూల్ | ఎం.లలితారాణి, గర్భాం మోడల్‌స్కూల్ | ముద్దాడ రేణుక, బొండపల్లి హైస్కూల్ | గొండేల రూప, బొండపల్లి హైస్కూల్

వై.నిర్జర, బొండపల్లి హైస్కూల్ | ఎస్.సాయిచంద్రనిఖిత, బొండపల్లి హైస్కూల్ | గెదేల ప్రవళ్లిక, బొండపల్లి హైస్కూల్ | రాహుల్ శ్రీనివాస నాయుడు, మరడాం హైస్కూల్ | వాలేటి గాయత్రి, మరడాం హైస్కూల్

పెంకి వరలక్ష్మి, మరడాం హైస్కూల్ | కె.జీవన్, కె.కొత్తవలస గురుకుల పాఠశాల | వి.సాయిగణేష్, కె.కొత్తవలస గురుకుల పాఠశాల | జి.మధు, కె.కొత్తవలస గురుకుల పాఠశాల | జి.లక్ష్మిప్రసాద్, కొత్తవలస మోడల్‌స్కూల్

ఎల్.నాగసిద్ధువరభాను మనోజ్, కొత్తవలస మోడల్‌స్కూల్ | ఏ.పల్లవి, కొత్తవలస హైస్కూల్ | మిడతాన లిఖిత, ధర్మవరం హైస్కూల్ | కరగాన జాహ్నవి, ధర్మవరం హైస్కూల్ | కర్రి రేష్మ, ఎస్.కోట శ్రీరవితేజ పాఠశాల

ఎల్.కరిష్మా, కొత్తవలస హైస్కూల్ | జి.కార్తిక్, కొత్తవలస మోడల్‌స్కూల్ | యు.మనోజ్ఞసాయిశ్రీ, కొత్తవలస మోడల్‌స్కూల్ | కె.సునీత, గరివిడి కేజీబీవీ | ఎస్.ప్రసన్న, గరివిడి కేజీబీవీ

## ఎస్‌బీఐ ఉద్యోగుల క్షేత్రపర్యటన



డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

బొండపల్లి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో ఉద్యోగాలు సాధించి గజపతినగరం బ్రాంచ్‌లో శిక్షణ పొందుతున్న బ్యాచ్ ఎల్‌డీఎం ఏ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలో గురువారం పర్యటించారు. బిల్లలవలస గ్రామంలో డ్రాగన్ ఫ్రూట్ సాగును పరిశీలించారు. ఆర్‌ఎస్‌ఈటీ శిక్షణ సంస్థ డైరెక్టర్‌లు శ్యామ్ ప్రసాద్, రమణ డ్రాగన్‌ఫ్రూట్ సాగులో రైతులు వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, పంట దిగుబడి, మార్కెటింగ్ తదితర అంశాలను వారికి వివరించారు.గజపతినగరం ఉద్యానవనశాఖ అధికారి ఏ.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### త్వరలో కొత్తరేషన్ కార్డులు

గజపతినగరం: జనవరి నుంచి ఇంత వరకు కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఈనెలాఖరు నుంచి రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నామని సీఎస్‌డీటీ రవిశంకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయాల్లో రేషన్ కార్డులు అందజేస్తామని పేర్కొన్నారు.

### చట్టాలపై అవగాహన అవసరం

వేపాడ: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వల్లంపూడి ఎస్ఐ రాజేష్ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు చట్టాలు, దిశ యాప్‌పై గురువారం అవగాహన కల్పించారు. మత్తుపదార్థాలలో కలిగే అనర్థాలను వివరించారు.ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

లక్కవరపుకోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన మండల సర్వ సభ్యసమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జ్ఞానేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు,సర్పంచ్‌లు, గత సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన పలు అంశాలపై నివేదికలు, అభివృద్ధి పనుల ప్రగతి నివేదికలతో అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.